

సాయిరామ్ కుటుంబానికి పరిహారం ఇవ్వాలి

ప్రజాశక్తి-కాకినాడ

తుపాను నేపథ్యంలో మరణించిన దుమ్ములుపేట మత్స్యకార యువకుడు గద్దేపల్లి సాయిరామ్ కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.25 లక్షల పరిహారం ఇవ్వాలని సిపిఎం జిల్లా కార్యదర్శి కరణం ప్రసాదరావు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. గురువారం సిపిఎం నగర కన్వీనర్ పలివెల వీరబాబు, మేడిశెట్టి వెంకటరమణ దుమ్ములపేటలోని సాయిరామ్ ఇంటికి వెళ్ళి కుటుంబ సభ్యులను పరామర్శించారు. పరిహారంతో పాటు ఆ కుటుంబానికి ఇంటి స్థలం కూడా ఇవ్వాలని కోరుతున్నామన్నారు. అనంతరం కుంభాభిషేకం ప్రాంతంలో ప్రస్తుతం ఉన్న వంతెన స్థానంలో పెద్ద వంతెన నిర్మించాలని, మత్స్యకారులు చేపట్టిన ఆందోళనకు వారు సంఘీభావం తెలిపారు.

వెన్ను విరిగిన వరి రైతు

- అంచనాల కంటే నష్టం ఎక్కువ
- 54 వేల ఎకరాల్లో మునిగిన పంటలు
- దిగుబడులపై ప్రభావం
- ఉద్యాన పంటలకూ నష్టం



పెదపూడి మండలం కైకవోలులో నీటమునిగిన పంటను చూసుకుంటున్న రైతు

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

ఆరు ఎకరాలు కౌలుకు సాగు చేశాను, పంట ఈనిక దశలో ఉంది. మరో 20 రోజుల్లో చేతికి అందుతుంది. ఈ లోపు తుపాను ముంచెత్తడంతో పంట పూర్తిగా నేలకొరిగింది. నీటిలో నాని కుళ్లిపోతుంది. ఎకరాకు రూ. 2 వేలు వరకు పెట్టుబడి పెట్టాను. ఖర్చులు కూడా రాని పరిస్థితి ఏర్పడింది అంటూ.. కంట తడి పెట్టుకుంటున్నాడు పెదపూడి మండలం కాండ్రేగుల గ్రామానికి చెందిన రైతు గోపిశెట్టి సత్యనారాయణ.

మూడెకరాలు కౌలుకి సాగు చేయగా అప్పు చేసి రూ.75 వేలు పెట్టుబడి పెట్టానని, పది రోజుల్లోనే కోతకు వచ్చే అవకాశం ఉందని, పూర్తిగా నష్టపోయానని అదే మండలం రాజుపాలెంకి చెందిన రైతు కోడే శ్రీను వాపోతున్నాడు. నాలుగెకరాలు కౌలుకి సాగు చేయగా అప్పులు చేసి రూ.లక్ష పెట్టుబడి పెట్టానని, తుపాను మొత్తం ఊడ్చేసిందని, ప్రభుత్వం ఆదుకోవాలని ఇదే గ్రామానికి చెందిన ఇళ్ల రామకృష్ణ ఆవేదన చెందుతున్నాడు.

తుపాను ప్రభావంతో ఇలా అనేకమంది సాధారణ రైతులు, కౌలు రైతులు తీవ్రస్థాయిలో నష్టపోయారు. ఆరుగాలం కష్టించి అప్పులు చేసి పెట్టుబడులు పెట్టిన వరిని తుపాను నిండా ముంచిందని పలువురు రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అనేకచోట్ల పొట్ట దశలో ఉండగా, ఇంకొన్నిచోట్ల గింజ పాలు పోసుకునే దశలో, మరికొన్నిచోట్ల 10 నుంచి 15 రోజుల్లో కోతకొచ్చే దశలో ఉండగా తుపాను ముంచెత్తింది.

జిల్లాలో 2.23 లక్షల ఎకరాల్లో వరి, దాదాపు 70 వేల ఎకరాల్లో పత్తి, ఆపరాలు, ఇతర పంటలను సాగు చేస్తున్నారు. ఆదిలోనే తీవ్ర సాగునీటి కొరతను ఎదుర్కొన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల కాలువలు ఆధునీకరణ లేకపోవడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. తీవ్రస్థాయిలో ఎరువుల కొరతతో ఇబ్బందులు పడ్డారు. ప్రైవేటు డీలర్ల వద్ద అప్పులు చేసి మరీ ఎరువును వేసుకునే పరిస్థితి ఏర్పడింది. యూరియా కొరత ఏర్పడడంతో అన్నదాతలు అల్లాడిపోయారు. ఇలా అనేక అవస్థల నడుమ సాగు చేపట్టగా ఇప్పుడు తుపాను పంటలను తుడిచిపెట్టేసింది.

54 వేల ఎకరాల్లో నష్టం

సామర్లకోట, కాజులూరు, పెదపూడి, కాకినాడ రూరల్, తాళ్లరేవు, కరప మొత్తం 20 మండలాల పరిధిలోని 222 గ్రామాల్లో 11 వేల మంది రైతులకు చెందిన 54,277 ఎకరాల్లో పంటలు నీట మునిగాయి. ఇందులో దాదాపు 50 వేల ఎకరాలలో వరి, మిగిలిన పత్తి, మినుములు, మొక్కజొన్న, రాగులు పంటలు నీట మునిగాయి. తుపాను ప్రభావంతో భారీగా వీచిన ఈదురు గాలులు, వర్షాల వల్ల పంట పూర్తిగా నేలకు ఒరగడంతో భారీ నష్టం తప్పదని రైతులు అంచనా వేస్తున్నారు. వ్యవసాయ శాఖ అధికారుల ప్రాథమిక అంచనా ప్రకారం 42 వేల ఎకరాల్లో వరి, ఇతర పంటలు నీటిలో మునిగినట్టు చెబుతున్నా నష్టం మరింత ఎక్కువగా ఉండే అవకాశం కనిపిస్తోంది. రెండు రోజులు గడిస్తేనే గానీ నష్టంతెలిసే అవకాశం ఉండదు.

పంట చేతికి వచ్చేలోపే...

ఈనిక, పాలు పోసుకునే దశలో ఉండడంతో ఇప్పుడు నేలకొరిగి నీటిలో నానుతూ పంట కుళ్ళిపోతున్న పరిస్థితి పలుచోట్ల కనిపిస్తోంది. ఒకటి, రెండు రోజుల్లో నీరు బయటకు పోతే సగానికి పైనే దిగుబడిపై ప్రభావం పడుతుంది. నీరు తగ్గకపోతే పంట పూర్తిగా కుళ్ళిపోయి నూరు శాతం నష్టం వాటిల్లే ప్రమాదం ఎక్కువ ప్రాంతాల్లో కనిపిస్తుంది. బీమా పథకంలో భాగంగా గతంలో రైతు వాటా ప్రీమియాన్ని ప్రభుత్వమే చెల్లించేది. ఇప్పుడు రైతు తన సొంత ఖర్చులతో ప్రీమియం చెల్లించాల్సి వస్తుంది. దీంతో అనేకమంది అవగాహన లేకపోవడంతో పంటల బీమా పథకంలో ప్రీమియం చెల్లించలేదు. నిబంధనల ప్రకారం చూసుకుంటే వీరికి కూడా పరిహారం అందే పరిస్థితి కనిపించడం లేదు.

15 ఎకరాల్లో పంటనష్టం



ఎకరాకు రూ.25 వేలకుపైనే పెట్టుబడి పెట్టి 32 ఎకరాలు సాగు చేస్తున్నాను. పంట అంతా పూర్తిగా రెండు, మూడు రోజుల్లో కోత దశకు వచ్చింది. ఈ లోపు తుపాను ముంచెత్తింది. 15 ఎకరాలు కోయడానికి పని చెయ్యదు. మిగిలిన పంట కోసినా కూలి ఖర్చులు కూడా రావు. ప్రభుత్వం నష్టపరిహారం పూర్తిగా అందించాలి

- నూనె వీర వెంకట సత్యనారాయణ,రైతు, గండ్రేడు, పెదపూడి మండలం.

అప్పులు చేసి పెట్టుబడులు



ఎకరాకు రూ.24 వేలు పెట్టుబడి పెట్టి 4 ఎకరాలు కౌలుకి సాగు చేస్తున్నాను. పంట పాలు పోసుకునే దశలో ఉండగా అంతా తుడిచి పెట్టుకుపోయింది. 50 శాతం కూడా పని చేయదు. అప్పులు పెట్టుబడులు పెట్టాము. ప్రభుత్వం ఆదుకోవాలి.

- కె.సూర్యనారాయణ, చాకిరేవు మేరకు, కాజులూరు మండలం.

నిబంధనలు సడలించి ఆదుకోవాలి



5 ఎకరాలు కౌలుకు సాగు చేస్తున్నాను. ఎకరాకి రూ.25 వేలు పెట్టుబడి పెట్టాను. తుపాను నిండా ముంచింది. గత వైసిపి ప్రభుత్వం బీమా ప్రీమియం రైతు తరపున నేరుగా చెల్లించగా, ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఎకరాకి రూ.700 చొప్పున బీమా ప్రీమియం చెల్లించాలని నిబంధన విధించారు. దాంతో నాతోపాటు అనేకమంది చెల్లించలేదు.

- బెజవాడ దివాణం, కౌలు రైతు, సామర్లకోట.

తుపానుతో రూ.90 కోట్ల నష్టం



ఏలేరు రిజర్వాయర్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎంఎల్ఎ

ప్రజాశక్తి-ఏలేశ్వరం

తుపాను ప్రభావంతో జిల్లావ్యాప్తంగా రూ.90 కోట్ల మేర నష్టం సంభవించినట్టు జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ తెలిపారు. గురువారం ఆయన ప్రత్తిపాడు ఎంఎల్ఎ వరుపుల సత్యప్రభతో కలిసి ఏలేరు రిజర్వాయర్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా 16 వేల హెక్టార్లలో పంట నష్టంతో పాటు వివిధ రోడ్లు పాడయ్యాయన్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు ఏలేరు రిజర్వాయర్‌కు గురువారం ఉదయం నుండ చి వరద నీరు భారీగా పెరిగిన నేపథ్యంలో దిగువ ప్రాంతాలకు 7,000 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నామన్నారు. నీటి విడుదలతో కిర్లంపూడి పిఠాపురం గొల్లప్రోలు సామర్లకోట కెనాల్ వెంబడి ఉన్న రోడ్లపైకి నీరు చేరిందన్నారు. నీటి ప్రవాహ ఉధతికి 6000 హెక్టార్ల పంట మునిగినట్టు ఆయన తెలిపారు.కలెక్టర్ వెంట పెద్దాపురం ఆర్‌డిఒ కె.శ్రీరమణి, ఇరిగేషన్ ఎస్ఇ కె.గోపీనాథ్, డిఇలు ఎ.రవికుమార్, ఇ.జనార్ధన్, కె.శ్రీకాంత్ పాల్గొన్నారు.

సామర్లకోట, పిఠాపురంలో కుంభవృష్టి



పిఠాపురం సీతయ్యగారి తోటలో నిలిచిన వర్షం నీరు

ప్రజాశక్తి - సామర్లకోట, పిఠాపురం

పట్టణంలో గురువారం తెల్లవారుజాము నుంచీ కురిసిన కుంభవృష్టి వానతో పలు ప్రాంతాలు జలమయం అయ్యాయి. వీధులు, కాలువలు పొంగి పొర్లడంతో వీధులు ఏరులను తలపించేలా వర్షపు జలాలు ప్రవహించాయి. తుపాను ప్రభావంతో తెల్లవారు జామునుంచి ఉదయం 8.30 గంటల వరకూ సామర్లకోట ప్రాంతాల్లో అతి భారీ వర్షం పడగా కొన్ని గంటల పాటు ప్రజా జీవనం స్పందించింది. పెద్దాపురం-సామర్లకోట రహదారులు జలమయం అయ్యాయి. పట్టణంలో కుమ్మరివీధి, ప్రెసిడెంట్ గారి వీధి, విశాలాక్షి నగర్, స్టేషన్ సెంటర్, వెలమ వీధి, గణపతి నగరం, జగ్గమ్మగారిపేటలో వర్షపు జలాలు ఇళ్లలోకి చేరుకోగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.



సామర్లకోటలో చెరువులా మారిన రోడ్డు

పిఠాపురంలో గురువారం ఉదయం కురిసిన భారీ వర్షానికి పట్టణంలోని లోతట్టు ప్రాంతాలు అన్ని జలమయం అయ్యాయి. యానాదుల కాలనీ, జీవన్ నగర్, విద్యుత్ నగర్, డ్రైవర్ కాలనీల్లో వర్షం నీరు ఇళ్ళలోకి చేరింది. పట్టణంలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా వుండంతో వర్షం నీరు రోడ్ల పైన నిలిచి చెరువులను తలపించాయి. తారకరామా నగర్, సీతయ్యగారి తోట, చిట్టోడి తోట వీధుల్లో వర్షం నీరు గంటల తరబడి ఇళ్ల ముందు నిలిచిపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. తుపాను ప్రభావంతో పిఠాపురంలో ఏలేరు కాలవ గట్లను, పంట పొలాలను, లోతట్టు ప్రాంతాలను ఎంపీ ఉదయ్ శ్రీనివాస్, ఎంఎల్‌సి పిడుగు హరి ప్రసాద్, డిసిసిబి చైర్మన్ తుమ్మల బాబు, మాజీ ఎంఎలఎ పెండెం దొరబాబు, మురాలశెట్టి సునీల్ కుమార్, ఊటా నానిబాబు పరిశీలించారు. బాధితులకు న్యాయం జరిగేలా చూస్తామన్నారు.



వరి పంట పొలాలను పరిశీలిస్తున్న రాజశేఖర్

ఎకరాకు రూ.30 వేల పరిహారం ఇవ్వాలి

ప్రజాశక్తి -కరప

తుపానుతో నష్టపోయిన చేలకు ఎకరాకు రూ.30 వేల పరిహారం ఇవ్వాలని కౌలు రైతుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.రాజశేఖర్ డిమాండ్ చేశారు. కరప మండలం అధ్యక్షుడు యడ్ల కృష్ణతో కలిసి గురువారం ఆయన గురజనాపల్లి, అడవిపూడి, కొంగోడు, వేములవాడ, కొరిపల్లిలో నష్టపోయిన పంట చేలను పరిశీలించారు. ప్రతి గ్రామంలో సర్వే చేసి పంట నష్టాన్ని నమోదు చేయాలని డిమాండ్ చేశారు. రైతులు, తమకు ప్రభుత్వ సహకారం, రుణాలు, ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వకపోయినా అప్పులు చేసి వ్యవసాయం చేస్తున్నారని, కానీ ప్రకృతి వైపరీత్యం వల్ల పెట్టిన పెట్టుబడి నష్ట పోతుంటే, ప్రభుత్వం పంట పండించని వారికీ రుణాలు, నష్ట పరిహారం ఇవ్వడం సరికాదని ఆవేదన వ్యక్తం చేసారు. ఈ కార్యక్రమంలో మెరిగి శ్రీనివాస్, వాసంశెట్టి శ్రీనివాస్, సత్యనారాయణ రెడ్డి, విహెచ్.గోవిందు, పుణ్యమాంతుల శ్రీను పాల్గొన్నారు.

పలుచోట్ల పంట నష్టాల పరిశీలన

తుపాను నేపథ్యంలో పంటనష్టాలను అధికారులు, ప్రజాప్రతినిధులు గురువారం పరిశీలించారు.

ప్రజాశక్తి - యంత్రాంగం

జగ్గంపేట మండలంలోని సీతానగరం, గుర్రంపాలెంలో అరటి, బొప్పాయి పంటలకు నష్టం వాటిల్లినట్టు ఉద్యానవన శాఖ అధికారి శ్రీవల్లి తెలిపారు. గురువారం ఆ గ్రామాల్లో పంటలను పరిశీలించారు. సీతానగరంలో 3.0 హెక్టార్లలో, గుర్రంపాలెంలో 0.5 హెక్టార్ లో నష్టం జరిగినట్లు అంచనా వేశారు. రామవరంలో పంటలను వ్యవసాయ సహాయ సంచాలకులు శ్రీనివాస్, ఎఒ నరసింహం పరిశీలించారు.

పెద్దాపురం చంద్రమాంపల్లిలో నష్టపోయిన వరి పొలాలను వ్యవసాయ అధికారులు పరిశీలించారు. వ్యవసాయ అధికారి ప్రమోద, టిడిపి నాయకుడు రేలంగి బుజ్జి, రేలంగి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు. రాయభూపాలపట్నంలో దుంప తోటలను ఉద్యాన అధికారులు పరిశీలించారు. ఉద్యాన శాస్త్రవేత్త డాక్టర్ ఎం.జానకి మాట్లాడుతూ పక్కకు ఒరిగిన దుంప మొక్కలను బలం పెట్టకుండా వీలైనంతగా యధాస్థితికి తీసుకురావాలన్నారు. దుంపలు పైకి కనిపిస్తున్న మొక్కల్లో దుంపలు కనిపించకుండా మట్టిని కప్పాలన్నారు. నీరు నిలిచిన దుంప చేల నుండి నీటిని బయటికి పంపించాలన్నారు. ఉద్యాన అధికారి కె.శైలజ, రైతులు పాల్గొన్నారు.

కరప మండలంలోని గ్రామాల్లో టిడిపి రాష్ట్ర కార్యదర్శి పిల్లి సత్యనారాయణ మూర్తి పర్యటించి నీటమునిగిన పంటపొలాలను పరిశీలించారు. తడిసిన ధాన్యం ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. మండలంలో 15 వేల ఎకరాల్లో సాగులో ఉన్న పంటలలో 3,500 ఎకరాలు దెబ్బతిన్నాయని ఆయన తెలిపారు. మాజీ జెడ్‌పిటిసి బుంగ సింహాద్రి, మద్దూరు స్వామి, గండి వెంకటేశ్వరరావు, చీపురుపల్లి జయేంద్ర బాబు, పంపన కన్నారావు, పులపుకూర శుభా మహేష్, అనుకూల రాంబాబు, గంట వీరన్న చౌదరి, రెడ్డి వీర వెంకట సత్యనారాయణ జోకా అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.



జగ్గంపేటలో సమూలంగా దెబ్బతిన్న అరటి తోట

సామర్లకోట మండల పరిధిలో 12,855 ఎకరాల్లో వరి పంటలు నష్టపోయినట్లు ప్రాథమికంగా గుర్తించామని ఎఒ వంగపండు మురళీధర్ తెలిపారు.ఉండూరు, జగ్గంగారిపేట, వేట్లపాలెం, జి.మేడపాడు, భీమవరంలో పంటలను పరిశీలించారు. రామకృష్ణ, రవి, పేపకాయల సుబ్బారావు పాల్గొన్నారు.

తాళ్లరేవు ఎన్‌జి రంగా వ్యవసాయ విశ్వ విద్యాలయం సంచాలకులు డాక్టర్ పివి.సత్యనారాయణ ఆధ్వర్యంలో పంట చేలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. పంట నష్టంపై నివేదిక తయారు చేసి ప్రభుత్వానికి అందజేస్తామని తెలిపారు. శాస్త్రవేత్తలు ఎం.గిరిజారాణి, దయాళ్ ప్రసాద్ బాబు, సీతారామశర్మ, రామభద్ర రాజు, సుధీర్ తదితరులు ఉన్నారు.

గొల్లప్రోలు నష్టపోయిన పంటలను మాజీ ఎంఎల్ఎ వర్మ పరిశీలించారు. దుర్గాడలో ఉద్యానవన పంటలను పరిశీలించారు. రైతులను పరామర్శించారు. తూము బాబు, మడికి ప్రసాద్, పెనుగొండ లక్ష్మీపతి, బుద్ధరాజు సాయి, బేతా సత్యనారాయణ, మాడెం సతీష్ పాల్గొన్నారు.

వంతెన నిర్మించాలని మత్స్యకారుల ఆందోళన



ధర్నా చేస్తున్న మత్స్యకారులు

ప్రజాశక్తి-కాకినాడ

కుంబాభిషేకం రేవు వద్ద వేటకు వెళ్లే బోట్లకు ఆటంకంగా ఉన్న పాత వంతెన స్థానంలో కొత్త వంతెన నిర్మించాలని గురువారం మత్స్యకారులు ధర్నా నిర్వహించారు. దుమ్ములపేట, పర్లోపేట, డైరీఫారం, కుంభాభిషేకం ప్రాంతాల నుంచి భారీ ఎత్తున ఈ ధర్నాలో పాల్గొన్నారు. సుమారు 30 సవత్సరాల నుండి ఈ పాత వంతెన వలన సుమారు 90 మందికి పైగా ప్రాణాలు పోయాయని, ఈ తుపానుకు ఒక యువకుడు చనిపోయాడని ఆవేదన చెందారు. తుపానులు గల్లంతైనా సాయిరామ్ కుటుంబానికి న్యాయం చేయాలని డిమాడ్ చేశారు. ఈ ధర్నాకు మత్స్యకారులు, మత్స్య కార్మిక సంఘం నాయకులు చెక్కా రమణి, యు.సత్యనారాయణ, సిఐటియు నాయకులు,టి.రాజా, పి.వీరబాబు, మేడిశెట్టి వెంకటరమణ, ఐద్వా జిల్లా అధ్యక్షురాలు గేదెల భూలక్ష్మి, డివైఎఫ్ఐ నాయకులు సిహెచ్.విజయ్ కుమార్ మద్దతు తెలిపారు. ధర్నాల్లో ఉన్న నాయకురాలు రమణిపై టిడిపి మహిళా నాయకులు దాడి చేయబోతే మహిళలు, యువకులు అడ్డుకున్నారు. తమ సమస్యలపై అడగడానికి వచ్చిన వారిపై దాడి చేయడం హేయమైన చర్య అన్నారు. ఎంఎల్ఎ వనమాడి కొండబాబు అక్కడికి వచ్చి కొత్త వంతెన పనులు ప్రారంభిస్తామని రాతపూర్వక హామీ ఇచ్చారు.

బాబూరావుకు మాజీ ఎంఎల్‌సి ఐవి నివాళి

ప్రజాశక్తి-కాకినాడ

చింతకాయ బాబూరావు మృతికి మాజీ ఎంఎల్‌సి ఇళ్ల వెంకటేశ్వరరావు నివాళులర్పించారు. ఈ మేరకు ఆయన గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. బాబూరావు సిఐటియు నాయకునిగా, సిపిఎం నాయకునిగా ఎదిగి పూర్తి కాలపు కార్యకర్తగా పని చేశారన్నారు. కార్మికుల, శ్రమజీవుల ఉద్యమాలకు అవసరమైన నాయకునిగా ఎదిగి వచ్చారని ఆయన గుర్తు చేశారు. అనేక ప్రజా సంఘాలను గైడ్ చేశారన్నారు. అనేక ఉద్యోమాలకు నాయకత్వం వహించి ఎన్నో పోరాటాలు నడిపారని గుర్తు చేశారు. అనారోగ్యానికి గురైనా ఆయన ఆశయాలను వీడలేదన్నారు. బాబూరావు భార్య యుటిఎఫ్ నాయకురాలు శ్రీదేవి, కుమారుడు సిద్ధార్థకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

ఏలేరు కాలువ గట్ల పరిశీలన

ప్రజాశక్తి-గొల్లప్రోలు

ఇటీవల తుపాను కారణంగా ఏలేరు కాలువ గట్టకు గండి పడడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. అనేక పంటలు తుపాను తాకిడికి నేలకొరిగాయి. గురువారం గొల్లప్రోలులోని గొర్రె కండి వద్ద ఉన్న ఏలేరు కాలువ మండలంలోని చేబ్రోలులోని కాలువను నష్టపోయిన పంటలను ఎంఎల్‌సి హరిప్రసాద్, ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ డిసిసి బ్యాంక్ చైర్మన్ తుమ్మల రామస్వామి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాలువకు గండ్లు పడ్డచోట యుద్ధ ప్రాతిపదికన పూడ్చే పనులు చేపట్టామని ఎక్కడైనా గండ్లు పడే పరిస్థితి ఉంటే ముందుగా ఇసుక బస్తాలు సిద్ధంగా ఉంచామన్నారు. ఇంత పెద్ద తుపానులో నష్ట నివారణ చర్యలు తీసుకోవడం వల్ల ప్రాణ నష్టం జరగకుండా తుపాను నుంచి బయటపడ్డామన్నారు. పంట నష్టంపై అధికారులు ఏయే ప్రాంతాల్లో ఎంత మేరకు నష్టం ఎంత వాటిల్లింది అన్నదానిపై కసరత్తు చేస్తున్నారన్నారు. మురాలశెట్టి సునీల్ కుమార్, వైస్ చైర్మన్ ఊటా నాని బాబు, జనసేన నాయకులు పెండెం దొరబాబు, బస్వా చిట్టిబాబు, కడారి తమ్మయ్య నాయుడు, మామిడాల సూరిబాబు, ఓదూరి కిషోర్, సూరిశెట్టి జయకృష్ణ, బలిరెడ్డి గంగబాబు పాల్గొన్నారు.

ఎంఎల్‌సి పద్మశ్రీకి ప్రొటోకాల్ భంగం

ప్రజాశక్తి-కాకినాడ

కాకినాడ కుంభాభిషేకం బీచ్ వద్ద మత్స్యకారులకు సాయం అందజేసే కార్యక్రమానికి హాజరైన ఎంఎల్‌సి కర్రి పద్మశ్రీని వేదిక పైకి పిలవలేదు. దీంతో ఆమె ఆగ్రహం వ్యక్తం చేసి అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఎవరి ఆదేశాలు పాటిస్తున్నారు, ప్రోటోకాల్ ఏమైందని అధికారులపై ఆమె ఆగ్రహించారు.

1న భవన నిర్మాణ రంగ కార్మికుల జిల్లా మహాసభ

ప్రజాశక్తి-గొల్లప్రోలు


నవంబర్ 1న జగ్గంపేటలో నిర్వహించే భవన నిర్మాణ కార్మికుల జిల్లా మహాసభను జయప్రదం చేయాలని సిఐటియు మండల కన్వీనర్ ఓరుగంటి నందీశ్వరుడు తెలిపారు. గురువారం మండలంలోని చేబ్రోలులో నిర్వహించిన సమావేశంలో సిఐటియు మండల కన్వీనర్ నందీశ్వరుడు మాట్లాడుతూ గోకవరం రోడ్డులోని కాపు కళ్యాణ మండపంలో మహాసభ నిర్వహిస్తామని తెలిపారు. కార్మికుల సంక్షేమ బోర్డు పునరుద్ధరించాలని, కార్మికుల సమస్యలపై ప్రభుత్వం చర్చించి పరిష్కరించాలని కోరారు. ఈ సమావేశంలో పెద్దింటి రమణ, టి.రవిబాబు, వి.కొండ, కె.శ్రీను పాల్గొన్నారు.

వార్డుల్లో సమస్యలపై కౌన్సిలర్ల ఆగ్రహం

ప్రజాశక్తి-పెద్దాపురం

వార్డుల్లో నెలకొన్న ప్రజా సమస్యలపై అధికారులు స్పందిస్తున్న తీరు ఏమాత్రం బాగాలేదని కౌన్సిలర్లు ధ్వజమెత్తారు. పెద్దాపురం మున్సిపాలిటీలో కౌన్సిల్ సాధారణ సమావేశం ఇన్‌ఛార్జి చైర్మన్ నెక్కంటి సాయిప్రసాద్ అధ్యక్షతన గురువారం నిర్వహించారు. తొలుత జీరో అవర్లో పలువురు కౌన్సిలర్లు వారి వార్డుల్లో నెలకొన్న సమస్యలను అధికారుల వద్ద ఏకరువు పెట్టారు. ఈ సందర్భంగా వైస్ చైర్మన్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారం, మున్సిపాలిటీ పరిధిలోని అభివద్ధి పనులపై అధికారులు దృష్టి సారించాలన్నారు. అత్యవసర సేవలైన తాగునీరు, వీధిలైట్లు, పారిశు ద్యంపై ప్రత్యేక దృష్టిపెట్టాలని అధికారులను ఆయన ఆదేశించారు. ఇంకా కమ్యూనిటీ హాల్ నిర్మాణం, వాటి నిధుల కేటాయింపు, బిల్లుల చెల్లింపు వంటి అంశాలపై కౌన్సిలర్లు అధికారులను ప్రశ్నించారు. రెండో వైస్ చైర్ పర్సన్ కనకాల మహాలక్ష్మి, మున్సిపల్ మేనేజర్ యు.జ్యోతిరాణి, మున్సిపల్ డిఇ ప్రకాశరావు, ఆర్ఒ అచ్యుతరాజు, టిపిఒ చింతా ఫణికుమార్, ఎఇలు పివి.సుధాకర్, ఉమామహేశ్వరి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఆదినారాయణ, గంగాధర్, అత్తిలి వీర్రాజు, సుభాషిణి పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



అపోలోలో స్ట్రోక్ అవేర్‌నెస్ ప్రోగ్రామ్



అవేర్‌నెస్ కార్యక్రమంలో మాట్లాడుతున్న వైద్య నిపుణులు

ప్రజాశక్తి-కాకినాడ

ప్రపంచ స్ట్రోక్ దినోత్సవం సందర్భంగా కాకినాడ అపోలో హాస్పిటల్లో గురువారం అవేర్‌నెస్ మీట్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో న్యూరో సర్జన్ డాక్టర్ మనీష్ గార్గ్ మాట్లాడుతూ స్ట్రోక్ వచ్చినప్పుడు వెంటనే చికిత్స అందించడం, ప్రాణాలను కాపాడడం కీలకం అని తెలిపారు. గురువారం కాకినాడ అపోలో ఆసుపత్రిలో విలేకరులతో సమావేశం నిర్వహించారు. స్ట్రోక్ లక్షణాలను గుర్తించడం, చికిత్స ఆలస్యం చేయకుండా తక్షణమే ఆసుపత్రికి చేరుకోవడం చాలా అవసరమని ఆయన చెప్పారు. ముఖం వంకరగా మారడం, చేతులు, కాళ్ల సడిలిపోవడం, మాట్లాడే సామర్థ్యం తగ్గిపోవడం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే జాగ్రత్తలు తీసుకోవాలిని డాక్టర్ గార్గ్ సూచించారు. న్యూరో విభాగం అధిపతి డాక్టర్ వి.భాస్కర్ మాట్లాడుతూ అపోలో హాస్పిటల్స్‌లో 24 గంటల అత్యాధునిక స్ట్రోక్ ట్రీట్‌మెంట్ సదుపాయాలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. డాక్టర్ సునీల్ మాట్లాడుతూ స్ట్రోక్ బాధితులకు అవగాహన, సమయానుకూలమైన చికిత్స, పునరావాసం అత్యంత కీలకం అని చెప్పారు. సీనియర్ మేనేజర్ ఎన్.అంజనేయస్వామి మాట్లాడుతూ అపోలోలో రౌండ్ ద క్లోక్ స్ట్రోక్ మేనేజ్‌మెంట్ సేవలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

ఇవిఎంల భద్రతకు చర్యలు



గోదామును పరిశీలిస్తున్న కలెక్టర్ షాన్‌మోహన్

ప్రజాశక్తి-కాకినాడ

ఇవిఎం, వివి.పాట్స్ భద్రతకు అవసరమైన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ సగిలి అధికారులను ఆదేశించారు. గురువారం కాకినాడ కలెక్టర్ కార్యాలయం వద్దనున్న ఇవిఎం గోదామును జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ తనిఖీ చేశారు. ఇవిఎం గోదాము భద్రతకు చేపడుతున్న చర్యలను జిల్లా కలెక్టర్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ మాట్లాడుతూ ఇవిఎం, వివి.పాట్స్ భద్రతకు చర్యలు చేపట్టాలని రెవెన్యూ, ఎన్నికల శాఖల అధికారులను ఆదేశించారు. ఆయన వెంట కలెక్టరేట్ ఎన్నికల విభాగం డిటి ఎం.జగన్నాథం ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

బైకుకు దుండగుల నిప్పు

ప్రజాశక్తి - గోపాలపురం

రాయల్ ఎన్‌ఫీల్డ్ బైకుకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ ఘటన ఆదివారం అర్ధరాత్రి సోమవారం తెల్లవారుజాము సమయంలో కొవ్వూరుపాడులో చోటుచేసుకుంది. బాధితుడు జొన్నాడ మురళి తెలిపిన వివరాలు ప్రకారం.. తన స్వగ్రామం కొవ్వూరుపాడులో నివాసం ఉంటున్నట్లు తెలిపాడు. ఈ నెల 27వ తేదీ సోమవారం తెల్లవారుజాము అర్ధరాత్రి సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు మోటార్ సైకిల్‌పై డీజిల్ పోసి నిప్పు పెట్టడంతో మంటలు చెలరేగడంతో ఎదురింటి వాళ్లు కేకలు పెట్టడంతో మెలకువ వచ్చి మంటలను అదుపు చేశామని తెలిపారు. దీనిపై గోపాలపురం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - నల్లజర్ల

మండలంలోని పోతవరం గ్రామానికి చెందిన మద్దుకూరి సత్యనారాయణ (53) విద్యుదాఘాతంతో మృతి చెందాడు. గురువారం జరిగిన ఈ సంఘటనకు సంబంధించిన వివరాలను మృతిని కుటుంబ సభ్యులు, పోలీసులు వెల్లడించారు. గురువారం ఉదయం ఇంటి నుంచి తన పొలంలోకి వెళ్లుతుండగా మార్గమధ్యంలో వేరొకరి పొలంలో విద్యుత్ స్తంభానికి ఉన్న సపోర్ట్ వైరుపై తాడి చెట్టు పడింది. ఆ వైరు నీటి బోదేకు అడ్డంగా ఉండటంతో ఆ వైరును పక్కకు వేసేందుకు చేత్తో పట్టుకున్నాడు. దీంతో విద్యుత్ షాక్‌కు గురియై అక్కడికక్కడే అతను మృతి చెందాడు. స్థానికులు పోలీసులకు సమాచారం అందించగా మృతదేహానికి పంచనామా నిర్వహించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తాడేపల్లిగూడెం తరలించారు. మృతునికి భార్య నాగమణి, ఒక కుమార్తె, కుమారుడు ఉన్నారు. నల్లజర్ల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చోరీ కేసులో నిందితుల అరెస్టు

ప్రజాశక్తి - గోకవరం

మండలంలోని తంటికొండ గ్రామానికి చెందిన కొవ్వాడ బాబూరావుకు చెందిన కోళ్లను దొంగిలించిన నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. కోళ్లను గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించారని వచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్లు ఎస్ఐ పవన్‌కుమార్ తెలిపారు. ఈ కేసులో నాటు కోళ్లను దొంగిలించిన ఆవుల గోపి, కొత్తపల్లి రమేష్, పిల్లల సురేంద్ర, మేడికొండ అనిల్‌కుమార్‌ను అరెస్టు చేసి వారి నుంచి రూ.30 వేలు విలువ చేసే కోళ్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వారిని కోర్టులో హాజరుపర్చినట్లు ఎస్ఐ తెలిపారు.

ఇసుక లారీలపై కేసు నమోదు

ప్రజాశక్తి - కొవ్వూరు

పట్టణ శివారులో దండగుండ ఇసుక ర్యాంపులో నకిలీ ధ్రువీకరణ పత్రాలతో తెలంగాణ రాష్ట్రానికి ఇసుకను తరలిస్తున్న మూడు లారీలపై కేసు నమోదు చేసినట్లు సిఐ పి.విశ్వం తెలిపారు. ఈనెల 23వ తేదీన గనులు భూగర్భ శాఖాధికారి ఫణిభూషణ్‌రెడ్డి, ఇతర విజిలెన్స్ అధికారులతో కలిపి ర్యాంపులో తనిఖీలు చేసినట్లు తెలిపారు. ఈ తనిఖీల్లో ధృవీకరణ పత్రాలు లేకుండా ఉన్న మూడు లారీలను గుర్తించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

రసాయన వాయువుల లీకేజీపై కేసు నమోదు

ప్రజాశక్తి - కొవ్వూరు

పట్టణ శివారుణ ఉన్న గ్రామం ఇండియా టోల్ ప్లాజా వద్ద ట్యాంకర్ లారీ నుంచి హైడ్రోక్లోరైడ్ ఆమ్లం లీకేజీ అవుతుండడంపై గురువారం కేసు నమోదు చేసినట్లు సిఐ పి.విశ్వం తెలిపారు. బలభద్రపురంలో గ్రాసింగ్ ఇండస్ట్రీస్ నుంచి చెన్నై వెళుతున్న ట్యాంకర్ లారీ కొవ్వూరు వచ్చేసరికి హెచ్‌సిఎల్ గ్యాస్ లీక్ అవుతుంది. టోల్ ప్లాజా వద్దకు వచ్చేసరికి గ్యాస్ లీకేజ్ అధికంగా ఉండి పొగలు వచ్చుచుండడంతో ఆ ప్రాంతంలో ఉన్నవారికి వాంతులు, కళ్ళు మంట తలనొప్పి వంటి సమస్యలతో ఇబ్బంది పడ్డారు. దీంతో టోల్ ప్లాజా మేనేజర్ జితేంద్ర రాణా ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

ఆటో బోల్తా

ప్రజాశక్తి - సామర్లకోట

మాధవపట్నం కెనాల్ రోడ్డు ప్రధాన రహదారికి పడిన గోతులు వర్షపు నీటితో గురువారం ఆటో బోల్తా పడింది. కాకినాడ ప్రధాన రహదారికి సామర్లకోట మండలం వికె.రాయపురం నుంచి మాధవపట్టణం దాటేంత వరకు విపరీతంగా గోతులు పడగా గురువారం తెల్లవారు జామునుంచి కురిసిన భారీ వర్షాల కారణంగా ఆ గోతులన్నీ నీటితో నిండుకున్నాయి. కాగా ఈ రోడ్డులో ప్రయాణం చేస్తున్న ఒక ఆటో గోతిలో పడి ప్రమాధానికి గురైంది.

లే ఔట్‌లో కాలువ పునరుద్ధరణ

ప్రజాశక్తి -తాళ్లరేవు

చొల్లంగిలో రైతువారీ కాలువ అక్రమంగా పూడ్చిన లేఔట్‌దారుడు రైతుల ఆందోళనకు దిగి వచ్చారు. తమ పంట పొలాల నుంచి మురుగు నీరు దిగే ఊట కాలువను పూడ్చి లేఔట్ నిర్మాణం చేయడం పట్ల బుధవారం రైతులు ఆందోళన చేశారను. దీనిపై లేఔట్‌దారుడు దిగివచ్చి గురువారం జెసిబితో ప్రహరీ గోడ తొలగించి కాలువలో వేసిన తూములను బయటికి తీసి కాలువను శుభ్రం చేశారు. దీంతో పొలాలలోని మురుగు నీరంతా బయటికి వెళ్లడంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు. ఈ పనులను తెలుగుదేశం పార్టీ మండల కార్యదర్శి కట్టా త్రిమూర్తులు, రైతులు వెంట్రు వెంకటరమణ, నిమ్మగడ్డ వీరభద్రరావు, కందిళ్ల గోవిందు, స్వర్ణ వీరబాబు, వెంట్రు రామకృష్ణ, వెంకన్న, కోట రామస్వామి, గొల్ల సత్యనారాయణ, గండి ఆంజనేయులు, బొబ్బర సత్యనారాయణ, స్థానిక నాయకులు పులపకూర త్రిమూర్తులు, వెంట్రు మహేష్, తదితరులు పరిశీలించారు.

ఆదిత్య ప్రొఫెసర్ కృష్ణవేణికి డాక్టరేట్

ప్రజాశక్తి-గండేపల్లి

ఆదిత్య యూనివర్సిటీ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ అసిస్టెంట్ ప్రొఫెసర్ పాలూరి కృష్ణవేణి విఐటి ఎపి యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ సాధించినట్లు ఆదిత్య యూనివర్సిటీ ప్ర ఛాన్సలర్ డాక్టర్ నల్లమిల్లి సతీష్ రెడ్డి తెలిపారు. డాక్టర్ ఆశిష్ గుప్తా నేతృత్వంలో కృష్ణవేణి సమర్పించిన థీసిస్‌కు డాక్టరేట్ పొందారని తెలిపారు. ఆదిత్య అధినేత, యూనివర్సిటీ ఛాన్సలర్ డాక్టర్ ఎన్. శేషారెడ్డి ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు.

యానాం వార్తలు



సిఎం రంగసామితో మల్లాడి కృష్ణారావు

సిఎం రంగసామితో మల్లాడి భేటీ

ప్రజాశక్తి - యానాం

పుదుచ్చేరి ముఖ్యమంత్రి రంగస్వామితో పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కష్ణారావు గురువారం భేటీ అయ్యారు. యానాంలో తుపాను నష్టాన్ని సిఎంకు మల్లాడి వివరించారు. యానాం ప్రజలను ఆదుకోవాలని ఆయనకు వినతిపత్రం అందించారు.

కాంగ్రెస్ నేతల సాయంతో గ్రావెల్ రోడ్డు

ప్రజాశక్తి - యానాం

స్థానిక కనకాలపేట ఫిషర్మెన్ పేట న్యూ కాలనీలో భారీ వర్షాల వల్ల ఉన్న రోడ్డు పూర్తిగా ధ్వంసం అయిందని స్థానికులు తెలిపారు. ఈ మేరకు కాంగ్రెస్ నాయకులు అర్ధాని దినేష్, కాటంశెట్టి రామ్మూర్తిని ఆశ్రయించగా తక్షణమే స్పందించి రెండు ట్రాక్టర్ల క్వారీ గ్రావెల్‌ను గురువారం పంపించారని అన్నారు. ఆ గ్రావెల్ ను స్థానికులు అందరూ కలిసి గుంతలు పడిన రోడ్డును పూడ్చారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులకు వారు కతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి రోడ్లు, డ్రైన్లు నిర్మించాలని కోరారు.

పార్టీ ప్రతినిధులతో ఓటర్ల నమోదుపై సమీక్ష

ప్రజాశక్తి - యానాం



ప్రతినిధులతో మాట్లాడుతున్న ఆర్ఎఒ

స్థానిక ప్రాంతీయ పరిపాలనాధికారి కార్యాలయంలో ఎఆర్ఒ, ఓటర్ల నమోదు అధికారి అంకిత్ కుమార్ గురువారం వివిధ రాజకీయ పార్టీ ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అంకిత్ కుమార్ మాట్లాడుతూ యానాం నుంచి స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ఆఫ్ ఫోటో ఎలక్టోరల్ రోల్స్ (ఎస్ఐఆర్)-2026 నవంబర్ 4 నుంచి డిసెంబర్ 4 వరకూ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. స్పెషల్ ఇంటెన్సివ్‌లో భాగంగా బూత్ లెవిల్ ఆఫీసర్ ఇంటింటికీ వెళ్లి ఫోటో ఎలక్టోరల్స్ నమోదు చేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో మంచాల సత్యసాయి కుమార్, మల్లాడి సామ్యూల్, అర్ధాని దినేష్, కనకాల రాజు, ధూళిపూడి మధు, తాజుద్దీన్ బాషా పాల్గొన్నారు.

పవర్ గ్రిడ్ ఆధ్వర్యంలో వాక్‌థాన్

ప్రజాశక్తి-గండేపల్లి

సూరంపాలెంలోని పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో విజిలెన్స్ అవేర్‌నెస్ వీక్ సందర్భంగా సంస్థ ఉద్యోగులు రామేశ్వరంపేట జంక్షన్ వరకు గురువారం వాక్‌థాన్ నిర్వహించారు. ఈ సందర్భంగా డిజిఎం పవన్ కుమార్ మాట్లాడారు. అవినీతిని నిరోధించడమనేది మనందరి భాధ్యత అని, ప్రతి పౌరుడూ అవినీతిని అంతమొందించడంలో తమవంతు కృషి చేయాలని, ప్రతి ఒక్కరూ ఇలా పూనుకున్నప్పుడు అవినీతి భూతాన్ని తరిమి కొట్టగలమని అన్నారు. ఈ కార్యక్రమంలో మేనేజర్లు నవీన్, కోటేశ్వరరావు, మహేష్ పలువురు ఉద్యోగులు పాల్గొన్నారు.

నిరుపేదలకు నారాయణరావు అన్నదానం

ప్రజాశక్తి - తాళ్లరేవు

విశ్రాంత ఉద్యోగి మేడిశెట్టి నారాయణరావు తన పుట్టిన రోజు సందర్భంగా నిరుపేదలకు అన్నదానం చేసి ఔదార్యాన్ని చాటుకున్నారు. 1035 రోజులుగా లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో గ్రామంలో నిర్వహిస్తున్న కొప్పిశెట్టి లక్ష్మయ్య బ్రహ్మార్పణ్ లయన్స్ ఉచిత అభాగ్యుల భోజన పథకానికి గురువారం నారాయణరావు సాయం అందజేశారు. ఆయన భార్య శమంతకమణి, కుటుంబ సభ్యులు, లయన్స్ క్లబ్ ప్రతినిధుల ద్వారా అభాగ్యులకు భోజనాలు అందజేశారు.

తుపాను నష్టాలపై ఎంఎల్ఎ సమీక్ష

ప్రజాశక్తి-పెద్దాపురం

తుపాను నష్టాలపై ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప గురువారం ఆర్‌డిఒ శ్రీరమణి అధ్యక్షతన అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. పంటలకు, రైతులకు జరిగిన నష్టం, ప్రజలకు సంభవించిన ఆస్తి నష్టం తదితర అంశాలపై వివరాలు అడిగారు. పునరావస కేంద్రాల్లో బాధితులకు అందజేసిన సదుపాయాలు, సహాయక చర్యలు, పరిహారాల అందజేతపై చర్చించి అధికారులకు పలు సూచనలు చేశారు. తహశీల్దారు సిహెచ్.వెంకటలక్ష్మి, మాజీ మున్సిపల్ చైర్మన్ రాజా సూరిబాబు రాజు, నూనె రామారావు, ముసిరెడ్డి శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యాన్ని మెరుగుర్చాలి

ప్రజాశక్తి-పిఠాపురం

2, 3, 4 వార్డుల్లో డ్రైనేజీ వ్యవస్థ, పారిశుధ్యాన్ని మెరుగుపరచాలని వార్డు సమస్యల పోరాట కమిటీ కన్వీనర్ కరణం విశ్వనాథం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. 3వ వార్డులో ఉన్న ప్రాంతాలు అన్ని వర్షానికి ముంపుక గురయ్యి రోడ్లు చెరువులను తలపిస్తున్నాయన్నారు. మురురునీరు వెళ్లే వజ్రకాలువ వరకు నిర్మాణం చేపట్టాలని, పారిశుధ్యం మెరుగు పరచాలని అన్నారు. ఈ సమస్యలపై అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా సమస్య పరిష్కారం కావట్లేదన్నారు.

వసతి గృహాల్లో సమస్యల తిష్ట

- అద్దె భవనంలో అరకొర వసతులు
- బాలికల వసతి గృహం మూత
- వర్షం వస్తే జాగారం

ప్రజాశక్తి-సామర్లకోట

సామర్లకోటలో నిర్వహిస్తున్న ఎస్‌సి, బిసి బాలికలు, బాలురల వసతి గృహాల తీరుతెన్నులు పరిశీలిస్తే వీటి నిర్వహణపై పాలకులు, ప్రభుత్వం ఎంత చిత్తశుద్ధితో ఉన్నాయో తెలుస్తోంది. చాలా ఏళ్ళ క్రితం శిథిల స్థితికి చేరిన ఎస్‌సి బాలికల వసతి గృహాన్ని ఎత్తివేశారు. భవనం పూర్తిగా శిథిలం కావడంతో సమీపంలో సెప్టిక్ ట్యాంకుల నిర్వాహకులు ఆక్రమణ చేసి ట్యాంకర్ల స్టాండుగా మార్చేశారు. గత ప్రభుత్వం సెప్టింక్ ట్యాంకర్లను తొలగించి, శిథిల భవనాన్ని పట్టించుకోకుండా కేవలం కొత మేర బాగునత్న హాస్టల్ వార్డెన్ భవనంలో 3, 9 వార్డులకు చెందిన గ్రామ సచివాలయం ఏర్పాటు చేసి నేటికీ నిర్వహిస్తున్నారు. మరోవైపు స్థానిక రాజీవ్ గృకల్ప సమీపంలో ఎస్‌సి బాలుర వసతి గృహం భవనాలు పూర్తిగా శిథిల స్థితికి చేరుకోవడంతో 2023లో శిథిల భవనంలోని వసతి గృహాన్ని ప్రత్తిపాడు రోడ్డులో జగనన్న కాలనీ ఎదురగా గల ఒక ప్రయివేటు వ్యక్తి ఇంట్లో ఏర్పాటు చేసి, నెలకు రూ.18,000 అద్దె చెల్లిస్తున్నారు. ఈ భవనంలో ప్రస్తుతం అసౌకర్యాల నడుమ సుమారు 65 మంది విద్యార్థులకుగాను 55 మంది ఎస్‌సి బాలుర విద్యార్థులు స్థానిక ప్రభుత్వ హైస్కూల్‌లో 6 నుండి 10వ తరగతి వరకూ విద్యను అభ్యసిస్తున్నారు. అద్దె భవనానికి ప్రభుత్వం నెలవారీ అద్దెలు సరిగా చెల్లించకపోవడంతో భవన యజమానులు హాస్టల్ భవనం నిర్వహణంపై పెద్దగా దృష్టి పెట్టడం లేదు. దీంతో చాలీచాలని స్నానపు గదులు, టాయిలెట్లతో చుట్టూ సరైన రక్షణ గోడలు లేక తుప్పలు పొదలు అధికంగా ఉండడంతో పాములు, విష కీటకాలు బెడద నడుమ కాలం వెళ్లదీస్తున్నారు. ప్రత్తిపాడు మెయిన్ రోడ్డు, ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు అతి దగ్గరగా ఉన్నప్పటికీ అసౌకర్యాల నడుమ విద్యార్థులు ఇబ్బందులతో సహవాసం చేస్తూ విద్యాభ్యాసం కొనసాగించాల్సిన దుస్థితి నెలకొంది. నిత్యం విద్యార్థులు ఉపయోగించే స్నానాలు కుండీ నిరపయోగంగా ఉంది, స్నానాలు గదులు సౌకర్యంగా లేవు. దీంతో విద్యార్థులు ఆరుబయట పైపులతో నీళ్లు పట్టుకుని స్నానాలు చేయాల్సిన పరిస్థితి. మంచాలు లేకపోవడంతో నేలపైనే చాపలు వేసుకుని రాత్రిళ్లు నిద్ర పోతున్నారు. మరోవైపు దోమల బెడద పగలూ రాత్రీ తాళలేని స్థితి ఉందని, విద్యార్థులు, హాస్టల్ సిబ్బంది చెబుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో పిఎం అజయ్ స్కీమ్ కింద రూ.కోటీ 60 లక్షల వ్యయంతో పూర్తిగా శిథిలమైన ఎస్‌సి హాస్టల్ భవనాన్ని తిరిగి నిర్మించేందుకు ప్రతిపాదనలు పంపగా, ప్రస్తుతం మొదటి దశలో ఉన్నాయని, రెండో దశలో నిధులు విడుదలయ్యే అవకాశం ఉందని ఎస్‌సి బాయ్స్ హాస్టల్ సంక్షేమాధికారి ఆర్.వర్మ తెలిపారు. ఇన్ని సమస్యలతో ఉన్న ఈ హాస్టల్‌ను బిసి బాలికల వసతి గృహంలోకి మార్పు చేయడానికి అనుమతి కోరుతూ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ సగిలికి పెద్దాపురం ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప ఈ ఏడాది జూలైలో లేఖ ఇచ్చినట్లు హాస్టల్ వార్డెన్ వర్మ చెప్పారు. ప్రస్తుతం హాస్టల్లో వున్న 15 మంది విద్యార్థులను పెద్దాపురం హాస్టల్‌కు తరలించాలన్న ప్రయత్నాలు శాఖాపరంగా అంగీకారం రాకపోవడంతో ఈ ప్రతిపాదన అమలులోకి రాని స్థితి నెలకొంది. మరోవైపు బిసి బాలికల వసతి గృహం పరిస్థితి మరింత అధ్వానంగా ఉంది. వర్షం వస్తే భవనంలోని స్టోర్ రూమ్, వంట గది, విద్యార్థినులకు ఏర్పాటు చేసి గదుల్లో నీరు కారి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మరోవైపు వర్షం నీరు కారడంతో తరచూ ట్యూబ్‌లైట్లు, ఫ్యాన్‌లు కాలిపోయి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కాలిపోతున్న ఫ్యాన్‌లు తరచూ మరమ్మత్తులు చేయించడం ఇబ్బందిగా ఉందని సిబ్బంది చెప్పారు. ప్రస్తుతం వున్న 15 మంది విద్యార్థినులు అందరూ కొంచెం శుభ్రంగా ఉన్న ఒకే గదిలో కాలక్షేపం చేస్తున్నారు. వర్షం వస్తే అన్నం తినే పళ్ళాలుతో నీరు పడకుండా పెట్టుకుని రక్షణ కల్పించుకుంటున్నారు. మరోవైపు రాజీవ్ గృహకల్ప కాలనీ వాసులు నిత్యం వేస్తున్న చెత్తా చెదారరం హాస్టల్ వెనుక భాగంలో పడుతూ తీవ్ర అసౌకర్యం కలిగిస్తోంది. ప్రధాన గోడకు ఆనుకూని తుప్పలు పేరుకుపోవడంతో హాస్టల్ పరిసరాలు పూర్తిగా అశుభ్ర వాతావారణంతో తాండవిస్తున్నాయని చెప్పక తప్పదు. వర్షం వస్తే పరిస్థితి మరింత అధ్వానంగా ఉంది. ఎస్‌సి బాలుర వసతి గృహంలో 50 మంది విద్యార్థులు ఇళ్లకు వెళ్లగా, బిసి బాలికల వసతి గృహంలో ఉన్న వారంతా ఆటోలో స్వంత ఇళ్ళకు ఆదివారం మద్యాహ్నం వెళ్లినట్టు ఇన్‌ఛార్జి వార్డెన్ శ్రీవల్లి తెలిపారు. నెలా నెలా విద్యార్థులకు ఇచ్చే కాస్మొటిక్ ఛార్జీలు ప్రభుత్వం నేరుగా వారి తల్లుల ఖాతాల్లోనే జమ చేస్తోందని, తమ వద్ద వివరాలు లేవని హాస్టల్ సంక్షేమాధికారులు చెబుతున్నారు. రిపేర్లు సైతం ఏళ్ళ తరబడి చేపట్టకపోవడంతో వసతి గృహం త్వరలో పూర్తి స్థాయిలో శిథిల స్థితికి చేరే పరిస్థితి నెలకొంది. ప్రస్తుతం బిసి బాలికల వసతి గృహంలోని 15 మంది విద్యార్థినులను పెద్దాపురం వసతి గృహానికి తరలించి, అదే గృహంలో సుమారు 50 మంది ఎస్‌సి బాలుర వసతి గృహం నిర్వహణ ఏలా చేపడతారో అర్థం కాని పరిస్థితి. ప్రభుత్వం, అధికారులు స్పందించి హాస్టల్స్‌ను మెరుగుపరాచలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.



శిథిల స్థితిలో మూతపడ్డ ఎస్‌సి బాలుర వసతి గృహం



కటిక నేలపై నిద్ర పోతున్న విద్యార్థులు

బాబూరావు మరణం తీరని లోటు

ప్రజాశక్తి-కాకినాడ

సిపిఎం, సిఐటియు తాడేపల్లిగూడెం నాయకులు చింతకాయల బాబూరావు మరణం కార్మికోద్యమానికి తీరని లోటని పలువురు అన్నారు. స్థానిక సుందరయ్య భవన్లో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి చెక్కల రాజ్ కుమార్ అధ్యక్షతన నిర్వహించిన సంతాప సభలో జిల్లా అధ్యక్షుడు దువ్వా శేషబాబ్జి, జాతీయ ఉపాధ్యక్షురాలు జి.బేబీరాణి తదితరులు బాబూరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. సాధారణ జట్టు కార్మికుడిగా తన జీవితం ప్రారంభించి, ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా సిఐటియు ప్రధాన కార్యదర్శిగా, జాతీయ కౌన్సిల్ సభ్యునిగా, సిపిఎం ఏలూరు జిల్లా పార్టీ కార్యదర్శిగా సేవలు అందించారన్నారు. మలకా రమణ, కె.సత్తిరాజు, చంద్రమళ్ల పద్మ, మేడిశెట్టి వెంకటరమణ, పలివెల వీరబాబు, కొల్లేపల్లి వీరబాబు, రాణి, విద్య, పి.సత్యన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రచారాలకే కూటమి ప్రభుత్వం పరిమితం

ప్రజాశక్తి-కోటనందూరు

కూటమి ప్రభుత్వానికి ప్రచారం మీద ఉన్న మోజు వరద బాధితులను ఆదుకోవడంలో లేదని వైసిపి జిల్లా అధ్యక్షుడు మాజీ మంత్రి దాడిశెట్టి రాజా అన్నారు. గురువారం తునిలోని పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రైతులు, మత్స్యకారులను ఆదుకోవడంలో వైసిపి శ్రేణులు అందరూ వారికి అండగా ఉండాలన్నారు. డ్రైనేజీలు మరమ్మతుల పేరుతో కూటమి నాయకులు తునిలో రూ.70 లక్షల నిధులు డ్రైనేజీల నిర్మాణం, మరమ్మతుల పేరుతో స్వాహా చేశారని ఆరోపించారు.

తుపాను బాధితులకు పలువురి సాయం

తుపాను బాధితులకు పలుచోట్ల గురువారం సాయం అందించారు. నిత్యావసరాలు, సరులకు అందించారు.

ప్రజాశక్తి-యంత్రాంగం

యు.కొత్తపల్లి ఉప్పాడలో బాధితులకు 50 కేజీల బియ్యం, నిత్యావసరాలు పంపిణీ చేశారు. ఎంపీ ఉదయ శ్రీనివాస్, జనసేన పార్టీ జిల్లా అధ్యక్షులు తుమ్మల రామస్వామి, మాజీ ఎంఎల్ఎలు ఎస్‌విఎస్ఎన్.వర్మ, పెండెం దొరబాబు, తోట సుధీర్, జ్యోతుల శ్రీనివాస్, సూరాడ రాజు, పెంకే జగదీష్, పాల్గొన్నారు.

పెద్దాపురం బాధితులకు స్థానిక ఆర్యవైశ్య సేవా సంఘం ఆధ్వర్యంలో ఆహార పదార్థాలు పంపిణీ చేసినట్లు దేవత రాజేష్ కుమార్ తెలిపారు. కాకినాడలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాల్లో, ఉప్పాడలో మత్స్యకారుల కుటుంబాలకు వీటిని పంపిణీ చేసినట్లు ఆయన తెలిపారు. పాలకుర్తి మణికంఠ, గ్రంధి రాజేష్, బోడా చరణ్, బి.లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

కరప రూరల్ ఎంఎల్ఎ పంతం నానాజీ ఉప్పలంకలో తుపాను బాధితులను కలిసి వారికి కావాల్సిన బియ్యం, నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. 1154 హెక్టార్లలో పంట నష్టంపై అధికారులు ప్రాథమిక అంచనా వేశారని,నష్టపోయిన ప్రతి రైతును ఆదుకుంటామని ఆయన తెలిపారు. నురుకుర్తి వెంకటేశ్వరరావు, తహశీల్దార్ తుమ్మల దుర్గాప్రసాద్, ఆర్ఐ పవన్, ముద్రగడ రమేష్, భోగిరెడ్డి కొండబాబు, నున్న గణేష్ నాయుడు, భోగిరెడ్డి గంగాధర్, యాళ్ల పండు తదితరులు పాల్గొన్నారు.

కోటనందూరు: వరద బాధితులకు ఎంఎల్ఎ యనమల దివ్య నిత్యావసర వస్తువులలు, బియ్యం పంపిణీ చేశారు. యనమల రాజేష్, చింతమనేడు అబ్బాయి, ఇనుగంటి సత్యనారాయణ, మున్సిపాలిటీ చైర్మన్ నార్ల భవన సుందరి, తహశీల్దారు జి.ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

తాళ్లరేవు మత్స్యకారులకు ఎంపీ గంటి హరీష్, ఎంఎల్ఎ దాట్ల సుబ్బరాజు, బియ్యం, నిత్యవసరాలు పంపిణీ చేశారు. తహశీల్దార్ పి.త్రినాధరావు, కామాడి మాతరాజు, లంకే నూకరాజు, చెక్క కామేశ్వరరావు, ధూళిపూడి వెంకటరమణ, పొన్నమండ రామలక్ష్మి, టేకుమూడి లక్ష్మణరావు, ఎం.గంగసూర్యనారాయణ, నడింపల్లి వినోద్, ఉంగరాల వెంకటేశ్వరరావు, వాసంశెట్టి శ్రీనివాస్, పినపోతు వీరబాబు, ప్రత్యేకాధికారి అడపా వెంకటలక్ష్మి, ఎంపిడిఒ లక్ష్మణరావు, డిటి సూరిబాబు, ఎఒ సత్యనారాయణ పాల్గొన్నారు.

రౌతులపూడి తుపాను ప్రభావంతో ఎ.మల్లవరంలో ఇల్లు కూలిపోవడంతో బాధితుడు ఉండా వరహాలు కుటంబాన్ని గురువారం టిఎన్ఎస్ఎఫ్ నాయకుడు గవిరెడ్డి గురునాథ్ పరామర్శించారు. బాధితులకు 25 కేజీల బియ్యం, నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. నిత్యావసర సరుకులు అందజేసిన గురునాథ్‌కు బాధిత కుటుంబం కృతజ్ఞతలు తెలిపింది.

ప్రత్తిపాడు ఒమ్మంగిలో ఎంఎంఆర్ ట్రస్ట్ చైర్మన్, వైసిపి నరసాపురం పార్లమెంట్ పరిశీలకులు ముదునూరి మురళీకృష్ణంరాజు పర్యటించారు. తుపానుతో దెబ్బ తిన్న గోపు బాజ్జి, కాపు, చుక్కల తాతారావు కుటుంబాలను పరామర్శించి ఓదార్చారు. గోపు బాజ్జి కుటుంబానికి రూ.10 వేలు, తాతారావు కుటుంబానికి రూ.5 వేలు, నిత్యావసర వస్తువులను అందజేశారు. ఎంపిపి గోళ్ల క్రాంతి సుధాకర్, ఎంపిటిసి సింద్రపు భాస్కరరావు, జువ్వల దొరబాబు, బొల్లు నాగేశ్వరరావు పాల్గొన్నారు.



ప్రత్తిపాడులో తుపాను బాధితులకు సాయం చేస్తున్న మురళీ కృష్ణంరాజు